క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్విజ్ పోటీలు

కాగజ్‌నగర్‌టౌన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం తెలిపారు. కళాశాలలోని సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బహుమతులతో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి చూపాలి



వాలీబాల్ కిట్ అందజేస్తున్న తిరుపతి గౌడ్

బెజ్జూర్: యువత క్రీడలపై ఆసక్తి కనబర్చాలని దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి అన్నారు. సోమవారం మండలంలోని తల్లైంగూడ, సలుగుపల్లి కుమురం భీం యువజన సంఘం యువకులకు వాలీబాల్ కిట్‌లతో పాటు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు యువత క్రీడల్లో రాణించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బూత్ కమిటీ అధ్యక్షుడు తొర్రెం మారుతి, వార్డు సభ్యులు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కెరమెరి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. శ్రీవేంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా సోమవారం కబడ్డీ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు కోవ దేవ్‌రావు, భీంరావు, భరత్, శ్రీనివాస్, వినేశ్ తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న జడ్జి ఉమామహేశ్వరి

ఆసిఫాబాద్‌రూరల్: చట్టాలపై ప్రతీ ఒక్కరు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఉమామహేశ్వరి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గిరిజన డిగ్రీ కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ర్యాగింగ్ వంటి సమస్యలు వస్తే భయపడకుండా కేసు వేయాలని, ఆత్మహత్యలు చేసుకొని జీవితాన్ని వృథా చేసుకోవద్దన్నారు. న్యాయవాదులు సతీష్ బాబు, రాజీవ్ రెడ్డి, విద్యాసాగర్, గణేష్, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

వారసంతలో అన్నదానం

కౌటాల: మండల కేంద్రంలోని మన్నెవార్ సేవా సంఘం భవనం ఎదుట సోమవారం శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ సోమవారం వారసంతకు వచ్చే ప్రజల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సభ్యులు అనిల్, అంజయ్య, మల్లేష్, బాపన్న, పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: ధమాక
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: ధమాక

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	100
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	40
బీరకాయ	40
కాకరకాయ	50
బెండకాయ	120
అలసంద	40
దొండకాయ	80
పచ్చిమిర్చి	50
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజి	40

-ఆసిఫాబాద్‌అర్బన్

చిన్నారి పెళ్లి కూతుళ్లు..!



చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్‌లో బాల్యవివాహాన్ని అడ్డుకుంటున్న అధికారులు (ఫైల్)

- వివాహ బంధంలో కూరుకుపోతున్న బాలికలు
- 'పది' పూర్తవగానే పెళ్లి చేస్తున్న తల్లిదండ్రులు
- జిల్లాలో నెలన్నరలో ఆరు బాల్యవివాహాల అడ్డగింత
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

తిర్యాణి: ఓ వైపు మహిళలు ఉన్నత స్థానాల్లో ఉంటూ దేశాన్ని ఏలుతుంటే మరోవైపు ఏజెన్సీ ప్రాంతాల్లో తెలిసీతెలియని వయస్సులో పెద్దలు చేస్తున్న పెళ్లిళ్లకు చిన్నారులు బలవుతున్నారు. లోకం తెలియని వయస్సులో పెళ్లి పీటలు ఎక్కి మూడు ముళ్ల చక్రబంధంలో బాలికలు చిక్కుకుపోతున్నారు. సామాజిక కట్టుబాట్లు, పేదరికం వంటి కారణాలతో ఎంతోమంది చిన్నారుల భవిష్యత్తు బాల్య వివాహాలతో బుగ్గిపాలవుతుంది. తల్లిదండ్రులకు ఎదురు చెప్పే ధైర్యం లేక పద్దెనిమిదేళ్లు నిండాకుండానే వివాహ బంధానికి బందీలవుతున్నారు. దీంతో చిన్నారులు మానసికంగా, శారీరకంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పది పూర్తయితే పెళ్లే..

జిల్లాలో పలు గ్రామాల్లో పదో తరగతి పూర్తవగానే కొందరు తల్లిదండ్రులు బాలికలకు పెళ్లి చేసి అత్తారింటికి పంపుతున్నారు. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఉన్నత విద్యనభ్యసించే అవకాశం లేకపోవడం కూడా ఇందుకు ఒక కారణంగా స్థానికులు చెబుతున్నారు. జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. బాలికలను పదో తరగతి వరకు ఆశ్రమ పాఠశాలల్లో చదివిస్తుండగా ఆర్థిక స్థోమత లేక పదో తరగతి పూర్తయిన వెంటనే వివాహం జరిపిస్తున్నారు. వీటికితోడు ఆధునిక కాలంలో పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం, సినిమాల ప్రభావంతో బాల్యంలోనే ప్రేమలో పడతారని భయంతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు పెళ్లిళ్లు చేస్తున్నారు. కొన్ని సామాజిక వర్గాల్లో ఆచారాల పేరుతో వయస్సుతో సంబంధం లేకుండా వివాహాలు జరిపిస్తున్నారు. బాల్యవివాహాలతో కలిగే అనార్థాలపై క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రెండేళ్లకు తగ్గకుండా జైలుశిక్ష..

చిన్న వయస్సులో జరిగే వివాహాలను నియంత్రించడానికి ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకొచ్చింది. బాల్య వివాహాల నిరోధక చట్టం, 1978లో జరిగిన సవరణ ప్రకారం వివాహ వయస్సు ఆడపిల్లకు 18సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలుగా నిర్ధేశించారు. 2006లో వచ్చిన కొత్త చట్టం ప్రకారం నిర్ణీత వయస్సు కంటే ముందు వివాహం జరిపిస్తే రెండేళ్లకు తగ్గకుండా జైలుశిక్ష విధించే అవకాశం ఉంది.

అవగాహన కల్పిస్తున్నా..

జిల్లాలో బాల్య వివాహాలతో కలిగే నష్టాలను అధికారులు వివరిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. చిన్నతనంలోనే తల్లులు కావడంతో మాతాశిశు మరణాలు సంభవించడంతో పాటు ఇతర అనారోగ్యాల బారిన పడుతున్నారు. జిల్లాలోని వాంకిడి, చింతలమానెపల్లి, సిర్పూర్(యూ), తిర్యాణి, రెబ్బెన, లింగాపూర్ ప్రాంతాల్లో బాల్య వివాహాల సంఖ్య కొంత పెరుగుతున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. కాగా గత నెలన్నర రోజుల్లో జిల్లాలో ఆరు బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు.

ఇటీవల అధికారులు అడ్డుకున్న బాల్య వివాహాలు..

- ఈనెల 23న రాత్రి రెబ్బెన మండలంలోని నారాయణపూర్ గ్రామంలో మైనర్ బాలికకు అదే గ్రామానికి చెందిన యువకుడితో వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో అధికారులు వివాహాన్ని అడ్డుకున్నారు.
- ఈనెల 24న కెరమెరి మండలంలోని ఖైరి గ్రామానికి చెందిన 15 ఏళ్ల అమ్మాయికి, 19 ఏళ్ల బాలుడితో వివాహం జరగ్గా, సమాచారం అందుకున్న అధికారులు అమ్మాయిని తాత్కాలిక వసతి కోసం జిల్లాకేంద్రంలోని సఖీ కేంద్రానికి తరలించారు.
- రెబ్బెన మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్లకు వచ్చే నెల 15న పెళ్లి చేయడానికి ఈనెల 24న ఇరు కుటుంబాలు నిర్ణయించగా, సమాచారం అందుకున్న అధికారులు ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

అవగాహన కల్పిస్తున్నాం

జిల్లాలో పూర్తిస్థాయిలో బాల్య వివాహాల నిర్మూలన కోసం క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గతంలో జిల్లాలో పదుల సంఖ్యలో బాల్య వివాహాల కేసులు నమోదు అయ్యేవి. ప్రస్తుతం వాటి సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రజల సహకారంతో పూర్తిస్థాయిలో బాల్య వివాహాలు జరగకుండా కృషి చేస్తున్నాం. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలి.

– మహేశ్, జిల్లా బాలల సంరక్షణ అధికారి

సిద్దాపూర్ భవనం 'పంచాయితీ'

- నూతన గ్రామ పంచాయతీ భవనం మంజూరు
- పెద్ద సిద్దాపూర్‌కు తరలించేందుకు ప్రజాప్రతినిధి యత్నం
- నిబంధనలకు విరుద్ధం అంటున్న చిన్న సిద్దాపూర్ గ్రామస్తులు
- చిన్న సిద్దాపూర్‌లోనే జనాభా ఎక్కువ



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉప సర్పంచ్, వార్డు సభ్యులు (ఫైల్)

బెజ్జూర్: మండలంలో కొత్తగా ఏర్పడ్డ పెద్దసిద్దాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో చిన్నసిద్దాపూర్, రంగాపూర్ గ్రామాలు ఉన్నాయి. పెద్ద సిద్దాపూర్‌లో 52 గృహాలు, 211 జనాభా ఉండగా, చిన్న సిద్దాపూర్‌లో 138 గృహాలు, 642 జనాభా, రంగాపూర్‌లో 22 గృహాలు, 50 మంది జనాభా ఉన్నారు. కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీకి ఇటీవల గ్రామ పంచాయతీ భవనం మంజూరు కాగా పెద్దసిద్దాపూర్‌లో గ్రామ పంచాయతీ భవనం నిర్మించేలా ఓ ప్రజాప్రతినిధి ప్రయత్నాలు చేస్తుండగా, పాలనా సౌలభ్యం కోసం జనాభా అధికంగా ఉన్న చిన్నసిద్దాపూర్‌లోనే జీపీభవనం నిర్మించాలని ఆ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.

పెద్దసిద్దాపూర్‌లో నిర్మించేందుకు ప్రయత్నాలు..

ప్రభుత్వ నిబంధనల మేరకు జనాభా అధికంగా ఉన్న గ్రామంలోనే గ్రామపంచాయతీ భవనం నిర్మించాల్సి ఉంటుంది. అయితే ఓ ప్రజాప్రతినిధి దానికి విరుద్ధంగా పెద్దసిద్దాపూర్ గ్రామంలో జీపీ భవనం నిర్మించేలా ప్రయత్నాలు సాగిస్తున్నాడు. అయితే చిన్నసిద్దాపూర్ గ్రామస్తులు మాత్రం జనాభాను దృష్టిలో పెట్టుకొని తమ గ్రామంలోనే భవనం నిర్మించాలని కోరుతున్నారు.

అధికారులకు వినతిపత్రాలు..

చిన్న సిద్దాపూర్‌లోనే గ్రామపంచాయతీ భవనం నిర్మించాలని ఉప సర్పంచ్ టాకిరె శ్రీనివాస్, వార్డు సభ్యులు నికూరి కోటేశ్, నికూరి సుజాత, సెండె మహేశ్, నికూరి రమేశ్‌లు అధికారులను కలిసి విన్నవించారు. ఈమేరకు ఇటీవలే తహసీల్దార్‌తోపాటు ఎంపీడీవోకు సైతం వినతిపత్రాలు అందజేశారు. జనాభా అధికంగా ఉన్న తమ గ్రామంలోనే భవనం నిర్మించాలని లేదంటే తమ పదవులకు మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఈవిషయమై బెజ్జూర్ ఎంపీవో రమేష్ రెడ్డిని వివరణ కోరగా గ్రామపంచాయతీ భవన నిర్మాణం జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేయాలనే నిబంధనలు ఉన్నాయన్నారు. పెద్దసిద్దాపూర్, చిన్నసిద్దాపూర్ జనాభాకు సంబంధించిన నివేదికను ఇదివరకే ఉన్నతాధికారులకు పంపినట్లు పేర్కొన్నారు. తదుపరి ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

జనాభా ఎక్కువ



చిన్న సిద్దాపూర్‌లో మిగిలిన గ్రామాల కంటే జనాభా ఎక్కువ. చిన్న సిద్దాపూర్ అతిపురాతనమైన గ్రామం. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు ఇక్కడే గ్రామపంచాయతీ భవనం నిర్మించాలి.

– నికూరి నారాయణ, చిన్నసిద్దాపూర్

చిన్నసిద్దాపూర్‌లోనే నిర్మించాలి



గ్రామపంచాయతీ భవనాన్ని చిన్నసిద్దాపూర్ గ్రామంలోనే నిర్మించాలి. నిబంధనల మేరకు అధికారులు నడుచుకోవాలి. పాలనా సౌలభ్యం మేరకు ఇక్కడ నిర్మిస్తేనే బాగుంటుంది.

– కావుడే విలాస్, చిన్నసిద్దాపూర్

విద్యుత్ ఉద్యోగుల ధర్నా

ఆసిఫాబాద్: పీఆర్‌సీ ప్రకటించి, అమలు చేయాలని జిల్లా విద్యుత్ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. దశలవారీ ఆందోళనలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాస్, జేఏవో రమేశ్, ఏఈ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు



కాగజ్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మూడోరోజూ కొనసాగిన విద్యుత్ ఉద్యోగుల నిరసన..

కాగజ్‌నగర్‌టౌన్: వేతన సవరణను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మూడోరోజు సోమవారం పవర్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. వేతన సవరణ చేపట్టాలని విద్యుత్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని, ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు వెంకటేష్, కె.శ్రీనివాస్, రవీందర్, శ్రీరాములు, తిరుపతి, శ్రీదేవి, శేఖర్, రమాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

అడవికే అందం.. మోదుగు పూలు





చింతలమానెపల్లి: నియోజకవర్గంలోని చెట్లకు మోదుగు పూలు ఎర్రటి వర్ణంలో విరగబూశాయి. ఎప్పటినుంచో గ్రామీణ ప్రజల జీవితంతో మోదుగు ఆకులు, మోదుగు పూలు ముడి వేసుకొని ఉన్నాయి. ఫిబ్రవరి నుంచి మార్చి వరకు మాత్రమే పూసే ఈ పూలను అగ్గిపూలు, గోగుపూలు అని కూడా పిలుస్తారు. ఆకురాలి అడవి ఎండిన సమయంలో అరుణ వర్ణంలో ఆకర్షణీయంగా కన్పిస్తూ అడవికే అందాన్ని తీసుకొస్తాయి.

నర్సరీ తొలగించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నర్సరీని వెంటనే తొలగించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతితో పాటు గ్రామ సర్పంచ్ మడావి పద్మ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మిలకు సమస్యలు విన్నవించారు. పాఠశాల ఆవరణలో నర్సరీ ఉండటంతో నర్సరీ చెట్లల్లో పాములు, విష కీటకాలు సంచరిస్తున్నాయని దీంతో విద్యార్థులు పాఠశాలకు రావాలంటే భయపడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా నర్సరీని తొలగించడంలేదని వాపోయారు. నర్సరీని తొలగించాలని విద్యార్థులు పాఠశాల ఎదుట నిరసన తెలిపారు.

హిందూ దేవాలయాల రక్షణలో ప్రభుత్వం విఫలం

- బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు



మాట్లాడుతున్న పాల్వాయి హరీష్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: హిందూ దేవాలయాలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణం సర్సిల్క్‌లోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లో వరుసగా పురాతన దేవాలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనబడుతుందన్నారు. భవిష్యత్తులో దేవాలయాలపై దాడులు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రెబ్బెన: మెడికో విద్యార్థిని ప్రీతి మృతికి కారకులైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవినాయక్ డిమాండ్ చేశారు. ప్రీతి మృతిపై ప్రభుత్వ తీరుకు నిరసనగా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అజ్మీర ఆత్మారాం నాయక్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయికిరణ్, నాయకులు వస్త్రం నాయక్, తిరుపతి పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: మెడికో విద్యార్థిని ధారావత్ ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌తో పాటు ఆయన అనుచరులను ఉరితీయాలని వివిధ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆమె మృతిపై సోమవారం నెహ్రూనగర్ నుంచి కెరమెరి బస్టాండ్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ, జ్యోతిబాపూలే విగ్రహం వద్ద మౌన ప్రదర్శన చేశారు. నాయకులు రూప్‌లాల్ రాథోడ్, శేశేరావు, ఉత్తం నాయక్, శివాజీ, తిరుపతి గిత్తే, వెంకట్ నాయక్, ఆత్రం కుసుంబ్‌రావు, వెంకటి, శ్రీకాంత్ ఉన్నారు.

మంత్రి ఐకే రెడ్డికి సన్మానం



కౌటాల: మంత్రిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కౌటాల: సిర్పూర్(టి) నియోజకవర్గంలో పలు సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనడానికి కౌటాలకు వచ్చిన రాష్ట్ర అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని సోమవారం స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసంలో కౌటాల ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆదే వసంత్ రావ్‌లు ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచ్ తిరుపతి, కోఆప్షన్ సభ్యులు అజ్మత్, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రవీందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాస్, రమేష్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: దేవాదాయ, అటవీ శాఖ మంత్రి ఐకే రెడ్డి దహెగాం మండలానికి వచ్చిన సందర్భంగా స్థానిక నాయకులు మంత్రికి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. సిర్పూర్(టి) నియోజకవర్గంలో తునికాకు బోనస్ 2016 నుంచి 2021 సంవత్సరం వరకు మంజూరైన రూ. 27కోట్ల చెక్కులను పంపిణీ చేసేందుకు రాగా ఆయనకు మండల నాయకులు స్వాగతం పలికారు. కాగా పెంచికల్‌పేట్, దహెగాం మండలాల తునికాకు రాయల్టీ చెక్కులను పంపిణీ చేసేందుకు మండలంలోని లగ్గాం గ్రామ సమీపంలో సమావేశం ఏర్పాటు చేశారు.

ఈకేవైసీ నమోదు చేసుకోవాలి

కౌటాల: రైతులు తప్పనిసరిగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు జె. మనోహర్ అన్నారు. సోమవారం తలోడి గ్రామ శివారులో గల పంటలను ఆయన పరిశీలించారు.